
పెద్దపులి సంచారం 2





'లేయర్'b కోళ్ల మాయాజాలం 2

AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in




## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలం గుత్ప గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2005-2006 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఏళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు పాఠశాల రోజుల్లో జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆనందోత్సాహాలతో గడిపారు.





# ఇంటర్‌లో బాలికల జోరు

**ఇంటర్ ఫలితాల్లో బాలికల హవా కొనసాగింది. ఇంటర్మీడియట్ వార్షిక ఫలితాలను అధికారులు ఆదివారం ఉదయం 11 గంటలకు విడుదల చేశారు. ఈ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. గత ఏడాదితో పోలిస్తే ఉత్తీర్ణత శాతం పెరిగింది. ప్రభుత్వ కాలేజీల విద్యార్థులు సైతం మెరుగైన ఫలితాలు సాధించారు. మొత్తం జిల్లాలో 66.19 శాతం మంది పాస్ అయ్యారు.**

**- అక్షరటుడే, భీమ్‌గల్**

- ఫలితాలు విడుదల చేసిన అధికారులు
- జిల్లాలో సెకండియర్‌లో 66.19 శాతం, ఫస్టియర్‌లో 56.64 శాతం పాస్
- గతేడాది కంటే మెరుగైన ఫలితాలు

జిల్లాలో ఇంటర్ పరీక్షలు ఫిబ్రవరి, మార్చిలో జరిగిన విషయం తెలిసిందే. ఈ ఫలితాల కోసం విద్యార్థులు ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా అధికారులు రిజల్ట్స్ రిలీజ్ చేశారు. సెకండియర్‌లో విద్యార్థులు 66.19 శాతం మంది, ఫస్టియర్‌లో 56.64 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ విభాగంలో ఫస్టియర్‌లో 49.65 శాతం, సెకండియర్‌లో 67.68శాతం పాస్ అయ్యారు.

### జనరల్‌లో..

ఇంటర్ జనరల్ ఫస్టియర్‌లో మొత్తం 15,547 మంది పరీక్షలకు హాజరు కాగా.. 8,806 మంది విద్యార్థులు పాస్ అయ్యారు. బాలికలు 8,711 మంది పరీక్షలకు హాజరు కాగా.. 5,868 మంది పాసై 67.36 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలురలో 6,836 మందికి 2,938 మంది ఉత్తీర్ణులయ్యారు. సెకండియర్‌లో మొత్తం 13,876 మందికి 9,187 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 7,606 మంది పరీక్షలు రాయగా.. 5,823 మంది, బాలురు 6 ,273 మందికి 3,364 మంది పాస్ అయ్యారు. బాలికల ఉత్తీర్ణత శాతం 76.56 శాతం, బాలురులది 53.63 శాతంగా నమోదు అయింది.

### ఒకేషనల్ విభాగంలో

ఒకేషనల్ విభాగంలో ఫస్టియర్‌లో 2,562 మంది పరీక్షలకు హాజరు కాగా 1,272 మంది విద్యార్థులు పాస్ అయ్యారు. 49.69శాతం పాస్ పర్సంటేజీ నమోదు అయింది. సెకండియర్‌లో 2,345 మంది పరీక్షలకు హాజరు కాగా 1,587 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 67.68 శాతం ఉత్తీర్ణత సాధించారు.

### మెరుగైన ఫలితాలు

జిల్లాలో గత సంవత్సరం కన్నా ఉత్తీర్ణత శాతం పెరిగింది. మెరుగైన ఫలితాలు వచ్చాయి. 2024-25 విద్యా సంవత్సరంలో ఇంటర్ సెకండియర్‌లో 58.21 శాతం ఉత్తీర్ణత సాధించగా ప్రస్తుతం 66.19 శాతం మంది పాస్ అయ్యారు. ఫస్టియర్‌లో 2024-25 విద్యా సంవత్సరంలో 53.37శాతం ఉత్తీర్ణత సాధించగా ఈ ఏడాది 56.64 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

### అధ్యాపకుల కృషితో..

జిల్లాలో ఫలితాలు ఆశాజనకంగా ఉన్నాయి. అధ్యాపకుల కృషి, విద్యార్థుల కష్టం ఫలితంగానే గత ఏడాదితో పోలిస్తే ఉత్తీర్ణత శాతం పెరిగింది. బాలికలు అన్ని విభాగాల్లోనూ అగ్రస్థానంలో నిలవడం గర్వకారణం.



**– రవికుమార్, డీఐఈవో**

రాష్ట్రవ్యాప్తంగా ఫలితాల్లో బాలికలు పైచేయి సాధించారు. ఇంటర్ ఫస్టియర్‌లో జనరల్, ఒకేషనల్ కలిపి 4,89,123 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 3,23,807 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారు. 66.20 ఉత్తీర్ణత శాతం నమోదైంది. సెకండియర్‌లో 5,07,948 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా ఇందులో 3,58,490 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. కాగా.. 70.58 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఫస్ట్ యర్‌లో 2,49,110 మంది బాలికలు పరీక్షలు రాయగా 1,85,331 మంది పాసయ్యారు. 74.40 శాతం ఉత్తీర్ణత నమో దైంది. ఇక బాలురు 2,40,013 మంది పరీక్షలు రాయగా 1,38,475 మంది ఉత్తీర్ణులయ్యారు. 57.69 శాతం ఉత్తీర్ణత నమోదైంది. సెకండియర్‌లో 2,54,050 మంది బాలికలు పరీక్షలు రాయగా 1,99,813 మంది ఉత్తీర్ణత సాధించారు. 78.65 శాతం ఉత్తీర్ణత నమోదైంది. 2,53,898 మంది బాలురు పరీక్షలు రాయగా 1,58,677 మంది పాసయ్యారు. 62.50 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

# కాకతీయ ప్రభంజనం..

## ఇంటర్ ఫలితాల్లో స్టేట్ ఫస్ట్, సెకండ్‌తో పాటు ఉత్తమ ర్యాంకులు



ఇంటర్మీడియట్ ఫలితాలు ఆదివారం విడుదలయ్యాయి. ఇందులో కాకతీయ విద్యార్థులు సత్తా చాటారు. స్టేట్ ఫస్ట్, సెకండ్‌తో పాటు ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఇంటర్ సెకండియర్‌లో స్టేట్ ఫస్ట్, ఫోర్త్ ర్యాంకులు, ఫస్టియర్‌లో ఇద్దరు విద్యార్థులు స్టేట్ సెకండ్ ర్యాంకులు, నలుగురు స్టేట్ నాలుగో ర్యాంకులు పొందారు.



### సెకండియర్‌లో..

సెకండియర్ ఎంపీసీలో మృదుల స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించగా, బైపీసీలో తుబా ఫాతిమా, బి.కావ్య నాలుగో ర్యాంకు సాధించారు. అంతేకాకుండా ఎంపీసీలో హమియా ఉమేమా, వై.గౌతమి ఆరో ర్యాంకు పొందారు. అలాగే డి.కౌచిత, ఏ.సంజన, సీహెచ్.వైష్ణవి, ఎన్.రూపాని, కె.కీర్తి, టి.నిత్యశ్రీ, కె.అశ్రిత స్టేట్ ర్యాంకులు సాధించారు.

### ఫస్టియర్‌లో..

ఫస్టియర్ ఎంపీసీలో బి.మనోగ్న, ఆర్.అక్షిత స్టేట్ సెకండ్ ర్యాంకులు పొందారు. అలాగే ఎస్.భవాని, సాకేత్, ఇష్రా మహీన్, జేఎస్.రినిత్య మూడో ర్యాంకులు సాధించారు. ఏ. సాయి విష్ణుత, తమన్నా నాజ్, సిరి వేద స్టేట్ ర్యాంకులు పొందారు.

ఈ సందర్భంగా కాకతీయ కళాశాల ప్రాంగణంలో సంబరాలు నిర్వహించారు. విద్యార్థులను సన్మానించారు. అనంతరం కాకతీయ విద్యాసంస్థల ఛైర్‌పర్సన్ సీహెచ్ విజయలక్ష్మి మాట్లాడుతూ అద్భుతమైన ఫలితాల వెనుక నిరంతర పర్యవేక్షణ ఉందన్నారు. విద్యార్థుల శ్రమ, తల్లిదండ్రుల ప్రోత్సాహం, అధ్యాపకుల కృషి ఎంతగానో ఉందని పేర్కొన్నారు. 90 శాతం మంది విద్యార్థులు అత్యుత్తమ మార్కులు, స్టేట్ ర్యాంకులు సాధించారన్నారు.

### రాష్ట్రంలో అగ్రగామిగా..

స్టేట్ ర్యాంకులే కాకుండా, అత్యుత్తమ ఉత్తీర్ణత శాతంతో కాకతీయ విద్యార్థులు రాష్ట్రంలో అగ్రగామిగా నిలవడం సంతోషంగా ఉందని విజయలక్ష్మి అన్నారు. అద్భుతమైన విజయాలకు కారకులైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఉత్తమ ఫలితాలు వచ్చేందుకు విశేషమైన కృషి చేసిన అధ్యాపక బృందానికి, ప్రోత్సాహాన్ని అందించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

## 'వీఆర్‌కే' విద్యార్థుల ప్రతిభ



**అక్షరటుడే, కామారెడ్డి:** ఇంటర్ ఫలితాలు ఆదివారం విడుదలయ్యాయి. ఈ సందర్భంగా కామారెడ్డి పట్టణంలోని వీఆర్‌కే విద్యార్థులు తమ ప్రతిభతో ఉత్తమ ఫలితాలు సాధించారు. ఆదివారం విడుదలైన ఫలితాలలో బైపీసీ సెకండియర్ విద్యార్థిని ఎ.నవోదయ 994 మార్కులు సాధించగా ఎంపీసీ సెకండ్ ఇయర్ విద్యార్థిని పి మైథిలి 993 మార్కులు, సీఈసీ సెకండియర్ విద్యార్థిని అనన్య 982, ఎంపీహెచ్ డబ్ల్యు సెకండియర్ విద్యార్థిని ఎం.అఖిల 987 మార్కులు సాధించారు. అలాగే ఎంపీసీ ఫస్టియర్ విద్యార్థిని నాష్ర జమ 466/470, బైపీసీ ఫస్ట్ ఇయర్ విద్యార్థిని శిరీష 436/440, బైపీసీ ఫస్ట్ ఇయర్ విద్యార్థిని జోబియా తన్వీర్ 435/440, సీఈసీ ఫస్ట్ ఇయర్ విద్యార్థిని మదీనా 483 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారు. విద్యార్థులను కళాశాల సీఈవో, కరస్పాండెంట్ జైపాల్ రెడ్డి అభినందించారు.




# మహిళలకు రిజర్వేషన్లు చారిత్రాత్మక నిర్ణయం..

## 2029 ఎన్నికల నాటికి అమలు: ఎంపీ అర్వింద్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు చారిత్రాత్మక నిర్ణయమని 2029 ఎన్నికల నాటికి వాటిని అమలు చేయబోతున్నామని ఎంపీ అర్వింద్ అన్నారు. ఈ మేరకు నగరంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మహిళల 30ఏళ్ల నిరీక్షణకు ప్రధాని మోదీ తెరదించారని.. వారికి ఇంతకంటే పెద్ద పండుగ ఉండదని ఎంపీ పేర్కొన్నారు. దేశ ప్రజాస్వామ్యాన్ని మార్చబోయే నిర్ణయం ప్రధాని తీసుకున్నారన్నారు. రాజ్యాంగబద్ధంగా మహిళలకు రిజర్వేషన్లపై చట్టం చేయబోతున్నారని వివరించారు. రాజకీయాల్లో మహిళల సంఖ్య పెరిగితే కచ్చితంగా అవినీతి తగ్గుముఖం పడుతుందని ఆయన పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్లు వారి హక్కు అని.. ప్రజాస్వామ్యంలో ఇవి తప్పనిసరి అని అన్నారు. దీనిని గుర్తించిన ప్రధాని చట్టసభల్లో రిజర్వేషన్ ఉండాలని పట్టుబట్టి అమలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. రాజకీయాలు చేయడం తప్ప కాంగ్రెస్ నాయకులకు ఏ పని చేయడం రాదని ఎంపీ అన్నారు. 27 ఏళ్లుగా మహిళా రిజర్వేషన్ల కోసం బీజేపీ పోరాటం చేస్తోందని.. ఎట్టకేలకు ఇప్పుడు అమలు దిశగా ముందడుగు పడిందన్నారు. డీలిమిటేషన్‌పై ఎలాంటి అపోహలు వద్దని అభద్రతాభావం అవసరమే లేదన్నారు. కొత్త పార్లమెంట్ భవనంలో 1,132 మంది సభ్యులు కూర్చునే విధంగా భవన నిర్మాణం జరిగిందని వివరించారు. తెలంగాణలో ఎంపీ స్థానాలు 17 నుంచి 26కు పెరిగాయని అది ప్రజల మద్దతుతోనే జరిగిందని వ్యాఖ్యానించారు. మహిళా బిల్లు రాజకీయాల కోసం తెచ్చిన బిల్లు కాదని కేవలం మహిళల ఉన్నతి కోసమే చేస్తున్న పని అని ఆయన పేర్కొన్నారు. కారక్రమంలో జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, పసుపు బోర్డు ఛైర్మన్ పల్లె గంగారెడ్డి, నాయకులు స్రవంతి రెడ్డి, మేడపాటి ప్రకాశ్ రెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.






# వైభవంగా భూలక్ష్మీ మాత ఆలయ వార్షికోత్సవం

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** నగరంలోని ముబారక్ నగర్ వీవీ నగర్ కాలనీలో భూలక్ష్మి మాత ఆలయ 19వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా లక్ష్మీనారాయణ కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో జరిపించారు. ఈ క్రతువులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు కల్యాణ్ శర్మ, వేద పండితులు రాజశేఖర్, సాయి ఆధ్వర్యంలో కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం ఐదు గంటలకు సుప్రభాత సేవ, అభిషేకాలు ప్రారంభమయ్యాయి. అనంతరం గోవులను ప్రత్యేకంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 8.30 గంటలకు స్వామివారికి మహా మంగళ హారతి ఇచ్చారు. అనంతరం 9 గంటల నుంచి 10వరకు హోమాలు జరిగాయి. భక్తుల జయజయధ్వానాల మధ్య లక్ష్మీ నారాయణుడి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పండితులు మంత్రోచ్ఛరణలతో క్రతువును పూర్తి చేశారు. ఈ సందర్భంగా భక్తులకు మహా అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే సాయంత్రం 6 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాత్రి 7 గంటలకు మహాహారతి, పల్లకీ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.



## బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలం రాంచంద్రపల్లిలో బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం అందజేశారు. గ్రామానికి చెందిన రుచిత ఇటీవల తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందారు. వారి పరిస్థితిని కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన చొరవతో సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. ఈ మేరకు ఆదివారం రుచితకు మంజూరైన రూ.17,500 చెక్కును ఆమె కుటుంబ సభ్యులకు సర్పంచ్ తొగరి భూషన్, పార్టీ నాయకుడు సుక్కి ప్రభాకర్ అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంగారాం, శశి కుమార్ కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రమాదకర విద్యుత్ స్తంభాల తొలగింపు..

అక్షర టుడే కథనానికి స్పందన

**అక్షరటుడే, కామారెడ్డి:** 'స్తంభాలు భయపెడుతున్నాయ్' శీర్షికన 'అక్షరటుడే'లో ప్రచురితమైన కథనానికి ట్రాన్స్‌కో అధికారులు స్పందించారు. ఈ మేరకు పట్టణంలో ప్రమాదకరంగా రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాన్ని తొలగించారు. మోర్ సూపర్ మార్కెట్ పక్కన నిత్యం రద్దీగా ఉన్న రోడ్డుపై రెండు స్తంభాలు ఉన్నాయి. రోడ్డు మధ్యలో ఉన్న ఇనుప స్తంభానికి పక్కనే ఉన్న సిమెంట్ స్తంభానికి ఏర్పాటు చేసిన సపోర్టింగ్ వైర్ సైతం ప్రమాదకరంగా మారింది. దీంతో నిత్యం ఈ దారి గుండా వాహనదారులకు ముఖ్యంగా స్కూల్ బస్సుల రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో 'అక్షరటుడే' కథనాన్ని ప్రచురించింది. ఈ కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. ఆదివారం సూపర్ మార్కెట్ పక్కన ప్రమాదకరంగా మారిన సిమెంట్ విద్యుత్ స్తంభంతో పాటు మార్కెట్ భవనంలో కొనసాగుతున్న గౌతమ్ పాఠశాల ముందు ఉన్న మరొక స్తంభాన్ని అధికారులు తొలగించారు. నూతన స్తంభాన్ని ఏర్పాటు చేశారు. అలాగే గౌతమ్ పాఠశాల వద్ద ఉన్న పోల్‌ను పూర్తిగా తొలగించి లయోల పాఠశాల ముందు కొత్తది ఏర్పాటు చేశారు. దారి మధ్యలో ప్రమాదకరంగా మారిన పోల్‌ను గ్యాస్ కట్టర్ సాయంతో పూర్తిగా తీసివేశారు. దాంతో నిజాంసాగర్ చౌరస్తా ప్రధాన రహదారి నుంచి పాఠశాలలు, అపార్టుమెంట్‌లకు వెళ్లే దారి విశాలంగా మారింది. స్థానికులు, అపార్ట్‌మెంట్‌వాసులు 'అక్షరటుడే'కు కృతజ్ఞతలు తెలిపారు.

**చికెన్ సెంటర్లలో సాధారంగా బాయిలర్ కోళ్లను విక్రయిస్తారు. కానీ ఇక్కడ మాత్రం లేయర్ చికెన్‌ను అమ్ముతున్నారు. గాంధారి మండలంలో లేయర్ కోళ్ల రేటుకు గుడ్ల కోళ్ల మాంసాన్ని విక్రయిస్తూ ప్రజలను వ్యాపారులు మోసగిస్తున్నారు. అయినా పట్టించుకునే వాళ్లు కరువయ్యారు.**

– అక్షరటుడే, గాంధారి



# చికెన్ సెంటర్లలో 'లేయర్' మాయాజాలం

- బాయిలర్ ధరకే లేయర్ చికెన్ అమ్మకాలు
- గాంధారిలో జోరుగా విక్రయాలు
- గుర్తించలేక కొనుగోలు చేస్తున్న ప్రజలు
- నాణ్యతలేని చికెన్‌తో వ్యాపారుల మోసం

మండల కేంద్రంలో ఇటీవల భారీగా పెరిగిన చికెన్ ధరలు కొంతమేర తగ్గాయి. దీంతో వినియోగదారులు చికెన్ కొనేందుకు ఉత్సాహం చూపారు. అయితే ఈ క్రమంలో లేయర్ కోళ్ల ఫాం వ్యాపారస్తులు జిమ్మిక్కు చేస్తున్నారు. తమ ఫాంలలో 50రోజుల వరకు గుడ్లు పెట్టిన కోళ్లను తమకు అవసరం లేదనుకున్న పరిస్థితుల్లో చికెన్ షాప్‌లకు తక్కువ ధరకే విక్రయిస్తున్నారు. సాధారణంగా బాలయిలర్ చికెన్ కిలో ధర రూ.280 ఉండగా.. లేయర్ చికెన్ ధర సుమారు రూ.100 తక్కువగా ఉంటుంది. అయినప్పటికీ లేయర్ చికెన్‌ను బాయిలర్ ధరకే అమ్ముతూ ప్రజలను మోసం చేస్తున్నారు.

### తేడా తెలియక వినియోగదారులు..

అయితే కొనుగోలుదార్లకు లేయర్ కోళ్లు, బాయిలర్ కోళ్లకు తేడా తెలియక చికెన్ ధర కొంత తగ్గిందని కొనుగోలు చేస్తున్నారు. అయితే చికెన్ సెంటర్ నిర్వాహకులు బాయిలర్ కోళ్ల స్థానంలో లేయర్ కోళ్లను అమ్ముతూ దండిగా సొమ్ము చేసుకుంటున్నారు. కాని నాణ్యత విషయంలో తేడాలు ఉంటాయనే విషయాన్ని కొనుగోలుదారులు గమనించట్లేదు. ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుంటున్న చికెన్ సెంటర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు.

### బాయిలర్ చికెన్ మాత్రమే విక్రయించాలి..

చికెన్ సెంటర్లలో బాయిలర్ కోళ్లు మాత్రమే అమ్మాలి. లేయర్ చికెన్ విక్రయాలు జరపవద్దు. ఎవరైనా ఫిర్యాదు ఇస్తే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటాం. ఫిర్యాదు ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

– శిరీష, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కామారెడ్డి










## కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఆర్మూర్, మాక్లూర్, లింగంపేటలలో కేంద్రాలను ప్రారంభించి తూకాలు వేశారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని రైతులు దళారులకు అమ్మి మోసపోవద్దని కొనుగోలు కేంద్రం నిర్వాహకులు సూచించారు.**

– అక్షరటుడే, నెట్‌వర్క్

## ఇందిరమ్మ ఇళ్లతో నిరుపేదల జీవితాల్లో వెలుగులు



**అక్షరటుడే, భిక్కనూరు:** ఇందిరమ్మ ఇళ్లతో నిరుపేదల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయని భిక్కనూరు సర్పంచ్ బల్యాల రేఖ అన్నారు. ఆదివారం భిక్కనూరులో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం లబ్ధిదారులకు నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోందని వివరించారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మోహనరెడ్డి, నేతలు రాజబాబు గౌడ్, సుదర్శన్, ఆంజనేయులు, వడ్లూరి అశోక్, రవి, రామచంద్ర, రాంరెడ్డి పాల్గొన్నారు.

## రాజారాం స్టేడియం వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గం



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** రాజారాం స్టేడియం వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. నగర శివారులోని నాగారం స్టేడియం ఆవరణలో ఆదివారం కార్యక్రమం జరిగింది. ఎన్నికల్లో అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా వై.దిగంబర్ విజయం సాధించారు. అసోసియేషన్ అధ్యక్ష పదవి కోసం బి.శ్రీకాంత్, వై.దిగంబర్‌ల మధ్య ఎన్నిక జరిగింది. మొత్తం ఓట్లలో దిగంబర్‌కు 61 ఓట్లు రాగా, శ్రీకాంత్‌కు 40 ఓట్లు వచ్చాయి. దీంతో 21 ఓట్ల మెజారిటీతో దిగంబర్ అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. మిగతా కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవమయ్యారు. కార్యదర్శిగా ఎన్ సాయిలు, కోశాధికారిగా బాయికాడి వెంకటేష్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా కె శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా ఎస్ శ్రీశైలం ఎన్నికయ్యారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, వాకర్స్ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కామారెడ్డిలో విషాదం..
### ఈతకు వెళ్లి విద్యార్థి దుర్మరణం..



**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డిలో విషాదం నెలకొంది. చెరువులో ఈతకు వెళ్లిన ఓ విద్యార్థి నీట మునిగి మృతి చెందాడు. పోలీసులు, గ్రామస్థులు కథనం ప్రకారం.. కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని టేక్రియాల్ గ్రామానికి చెందిన కుర్మ రాకేష్ (15) గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ప్రస్తుతం పరీక్షలు కొనసాగుతున్నాయి. అయితే ఆదివారం కావడంతో మరో ఇద్దరు మిత్రులతో కలిసి గొర్లు మేపడానికి వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో ఎండ తాకిడికి చెరువులో ఈత కొట్టడానికి ముగ్గురు దిగారు. ఈత కొడుతుండగా ప్రమాదవశాత్తు రాకేష్ చెరువులో ఉన్న గుంతలో ఊపిరాడక మృతి చెందాడు. బాలుడి మృతితో కుటుంబం విషాదంలో మునిగిపోయింది. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. రాకేష్ తల్లి స్వప్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## మున్నూరు కాపుల ప్రగతికి వెన్నుదన్నుగా నిలుస్తా..

**అక్షరటుడే, ఇందూరు:** మున్నూరు కాపులు అభివృద్ధి బాటలో నడిచేందుకు అన్ని విధాలుగా వెన్నుదన్నుగా నిలుస్తానని జిల్లా మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ అన్నారు. ఆదివారం నగరంలోని రేణుక నగర్‌లో ఆదర్శ మున్నూరు కాపు సంఘం సర్వసభ సమావేశం, నూతన కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లాలో మున్నూరు కాపులను ఏకతాటిపైకి తీసుకువచ్చి తద్వారా మన బలాన్ని నిరూపించుకుందామని సంజయ్ అన్నారు. కాపుల అభివృద్ధికి శాయాశక్తులా కృషి చేస్తానన్నారు. మరిన్ని కార్యక్రమాలు చేపట్టి అందరినీ సంఘటిత పరుస్తానని ఆయన తెలియజేశారు. పేరుకు తగ్గట్టుగానే ఆదర్శ మున్నూరు కాపు సంఘం తమ పనితీరులో ఆదర్శంగా నిలుస్తున్నారని కితాబునిచ్చారు. అనంతరం సభ్యులకు హెల్త్ కార్డులను అందజేశారు. భవిష్యత్తులో

## ఇంటర్ ఫలితాల్లో బన్సల్ జూనియర్ కాలేజీ విద్యార్థుల సత్తా..




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఇంటర్ ఫలితాల్లో నగరంలోని బన్సల్ జూనియర్ కాలేజీ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా కాలేజ్ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి తమ సత్తా చాటారు. పలువురు విద్యార్థులు 950కి పైగా మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందారు. ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో విద్యార్థులు విశేష ఫలితాలు సాధించారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో నమిత్, శ్రీహిత మార్కులకు గాను సాధించి కళాశాల టాపర్‌గా నిలిచారు. అదేవిధంగా మొదటి సంవత్సరం బైపీసీలో 440 మార్కుల గాను 435 మార్కులు తీన్యశ్రీ హాల్ కళాశాల టాపర్‌గా నిలిచింది. శ్లోకా జాదవ్ 440 మార్కులకు గాను 433 మార్కులు సాధించింది. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో కూడా బన్సల్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ఎంపీసీ విభాగంలో ధనుష్ 1000 మార్కులకు గాను 974 మార్కులు సాధించాడు. రోనిత్ 973 మార్కులు, బైపీసీ విభాగంలో ఎస్ ప్రవీణ్ 971 మార్కులు, ఈ నరేష్ 961 మార్కులు సాధించారు. విద్యార్థుల సాధించిన ఫలితాలకు అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం, క్రమబద్ధమైన బోధన విధానం, ప్రత్యేక పరీక్షా పద్ధతులు, విద్యార్థుల కృషి ఎంతో ఉందని యాజమాన్యం పేర్కొంది. ఈ సందర్భంగా విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం పింగిలి ప్రదీప్ రెడ్డి, మాదడి సాహితి, మేకల లక్ష్మణ్, మేకల జమున, నరాల సుధాకర్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## ఎల్లంపేట శివారులో పెద్దపులి సంచారం..





**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి జిల్లాలో పెద్దపులి మరోసారి సంచరించడం కలకలం రేపుతోంది. మాచారెడ్డి రేంజ్ పరిధిలోని రెడ్డిపేట స్కూల్ తండా శివారులోని అటవీ ప్రాంతంలో గత ఆరు నెలల క్రితం పెద్దపులి సంచరించింది. ఆ తర్వాత అటవీ ప్రాంతం గుండా నిజామాబాద్ వైపు వెళ్లి ఉంటుందని అధికారులు అనుమానించారు. గత రెండు నెలలక్రితం దోమకొండ మండలంలో మరోసారి పెద్దపులి సంచరించినట్లుగా అధికారులు గుర్తించారు. ప్రస్తుతం మరోసారి మాచారెడ్డి రేంజ్ పరిధిలోని ఎల్లంపేట బీట్ అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తున్నట్లుగా అధికారులు గుర్తించారు. దాంతో అటవీ ప్రాంతంలో అధికారులు పులి జాడ కోసం ట్రాక్ కెమెరాలు ఏర్పాటు చేశారు. అలాగే పులి పాదముద్రలు సైతం ఫారెస్ట్ అధికారులు గుర్తించినట్లుగా తెలుస్తోంది. ట్రాక్ కెమెరాల్లో సైతం పెద్దపులి సంచరిస్తున్నట్లుగా రికార్డయినట్లు సమాచారం. పెద్దపులి సంచారంతో అటవీ ప్రాంత సమీప గ్రామస్థులను ఫారెస్ట్ అధికారులు అలర్ట్ చేశారు. పులి సంచారంతో సమీప గ్రామ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గత ఆర్నెళ్లక్రితం గోదావరి నది దాటి జగిత్యాల జిల్లా మీదుగా నిజామాబాద్ జిల్లాలోకి ప్రవేశించి అక్కడి నుంచి కామారెడ్డి జిల్లాలోకి పులి ప్రవేశించినట్లుగా అధికారులు గుర్తించారు. ఆ తర్వాత రాజన్న సిరిసిల్ల జిల్లా మీదుగా సిద్దిపేట వైపు వెళ్లి తిరిగి కామారెడ్డి జిల్లాలోని మాచారెడ్డి రేంజ్ పరిధిలోకి పెద్దపులి ప్రవేశించడంతో మాచారెడ్డి రేంజ్ అటవీ ప్రాంతం పెద్దపులికి అనువుగా ఉన్నట్లుగా ఫారెస్టు అధికారులు అనుమానిస్తున్నారు. అయితే సంతానోత్పత్తి కోసం పులి వచ్చినట్లుగా అధికారులు భావిస్తున్నారు. అందుకోసం ఈ ప్రాంతాన్ని సేఫ్ జోన్‌గా పులి భావిస్తున్నట్టుగా తెలుస్తోంది. అటవీశాఖ అధికారులు పెద్దపులి కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

## పేదింటి బిడ్డ.. ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ..



**అక్షరటుడే, భిక్కనూరు:** మండల కేంద్రానికి చెందిన వడ్లూరు మహేష్ ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 470 మార్కుల గాను 467 మార్పులు సాధించి ప్రతిభ చూపాడు. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయిన మహేష్‌ను తల్లి శోభ బీడీలు చుడుతూ కుటుంబాన్ని పోషించింది. అలాగే మేనమామ సహకారంతో మహేశ్ చదువుకున్నాడు. 10వ తరగతిలో మహేష్ మండల టాపర్‌గా నిలిచాడు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్యభట్ట జూనియర్ కళాశాలలో చదువుతున్న మహేష్ ఇంటర్ ఫస్టియర్‌లో రాష్ట్రస్థాయిలో సెకండ్ ర్యాంక్ సాధించాడని గ్రామస్థులు తెలిపారు. కాగా.. ఆదివారం మహేశ్ తల్లి శోభకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా గృహప్రవేశం చేశారు. ఒకేరోజు ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం, కొడుకు ఫస్టియర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించడంతో ఆ తల్లి ఆనందానికి అవధుల్లేకుండా పోయింది.